www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 12 ఏప్రిల్ 2025
5
వైఎస్ఆర్



ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పిద్దాం : యుటిఎఫ్

ప్రజాశక్తి-చెన్నూరు

ప్రభుత్వ బడిలో బడిఈడు పిల్లలను చేర్పించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నాదేవి పిలుపునిచ్చారు. చెన్నూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 'ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం' అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ ఆప్యాయత, మానవత్వపు పరిమళం, ఎదుటివారు కష్టాల్లో ఉండే సహాయపడటం, జట్టు తత్వం, ఎలాంటి పరిస్థితులునైనా ఎదుర్కొనే ధైర్యం, ఎదుటివారితో గౌరవంగా మెలగడం, సమాజంలో ఎలా జీవించాలో నేర్పించడం, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలనే స్పృహ ప్రభుత్వ బడి నేర్పిస్తుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ బడిని కాపాడుకోవడంలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.

కమనీయం.. రమణీయం





- వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం
- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సిఎం చంద్రబాబు
- భారీగా తరలివచ్చిన ప్రజానీకం
- యాత్రికులతో కిక్కిరిసిన ఒంటిమిట్ట
- ఆధ్యాత్మిక శోభతో పరవశించిన ఏకశిలానగరి

దేశంలోనే రెండో భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి శ్రీసీతారాముల కల్యాణం భక్త జనసందోహం, శ్రీరామ నామస్మరణల మధ్య వైభవంగా జరిగింది. విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని పౌర్ణమి పండు వెన్నెల్లో తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు, యాత్రికులు, పర్యాటకులు, సేవకులు పెద్దఎత్తున విచ్చేశారు. కడప-చెన్నయ్ ప్రధాన రహదారికి సమీపంలోని విశాలమైన మైదానంలో ఆకాశమంత చలువ పందిళ్లు వేసి పలు రకాల పూల పరిమళాలు, విద్యుత్ కాంతులు, భక్తుల కోలాటాలు, విద్యుత్ దీపాలంకారణలతో కూడిన కల్యాణ వేదిక వైకుంఠాన్ని తలపించింది. అంతకు ముందు సీతారాములవారిని ఆలయం నుంచి ఊరేగింపుగా మంగళ వాయిద్యాల నడమ కల్యాణ మండపం వద్ద ఆసీనులను చేశారు. వేదపండితులు ముందుగా ప్రత్యేక పూజలను నిర్వహించి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ వేదిక ప్రాంగణం నుంచి వీనుల విందుగా సాగిన వ్యాఖ్యానాలు, ప్రవచనాలు ప్రజలను తన్మయులను చేశాయి. కల్యాణ వేదిక ప్రాంగణంలో పలుచోట్ల ఎల్ఇడి తెరలను ఏర్పాటు చేసి స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి ఏర్పాటు చేశారు. తమ వంశం గొప్పదంటే తమ వంశమే గొప్పదని కొంత మంది వేద పండితులు సీతమ్మ వైపు, శ్రీరాముల వారి వైపు మరికొందరుచేరి వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాలనడుమ శ్రీసీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. టిటిడి ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తులకు కనువిందు చేశాయి.



స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు

ప్రజాశక్తి-ప్రజాశక్తి ప్రతినిధి/ఒంటిమిట్ట

శ్రీకోదండరామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా జగదభిరాముని కల్యాణానికి ప్రభుత్వం తరపున ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. టిటిడి అర్చకస్వాములు శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. తరువాత వారికి ఆలయ విశిష్టత, రాములవారి ప్రాశస్త్యం, సీతారాములకు చేయించిన బంగారు ఆభరణాల గురించి వివరించారు. శ్రీసీతారాముల విగ్రహాల శిరములపై జీలకర్ర, బెల్లం పెట్టారు. ఈ మహాద్భుత సన్నివేశాన్ని వేదపండితులు ప్రజానీకానికి చూపించి సీతమ్మ వారి మెడలో మగళసూత్రాన్ని ధరింపజేశారు. ఈ మహాద్భుత దృశ్యాన్ని చూసి తరించేందుకు విచ్చేసిన భక్తులు జైశ్రీరామా అనే రామనామ స్మరణలతో కల్యాణ వేదిక, కోదండరామాలయ పరిసర ప్రాంతమంతా మార్మోగింది. ఏకశిలానగరిలో కోదండరాముడి కల్యాణానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి, టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, టిటిడి జెఇఒ వీర బ్రహ్మం, టిటిడి బోర్డు మెంబర్లు ఎం.ఎస్.రాజు, జ్యోతుల నెహ్రూ, భాను ప్రకాష్‌రెడ్డి, పనబాకలక్ష్మీ, నన్నపనేని సదాశివరావు, శాంతారామ్, తమ్మిశెట్టి జానకిదేవి, సుచిత్ర ఎల్లా, నరేష్‌కుమార్, ఎంపీ సిఎం.రమేష్, కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు హాజరయ్యారు.

భారీగా తరలి వచ్చిన భక్తజనం : సాయంత్రం 5 గంటల నుండి భక్తజనం భారీగా తరలివచ్చారు. ఇతర జిల్లాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఎటు చూసిన భక్తులతోనే నిండి ఉంది. సాయంత్రం ఆరు గంటలకే జనంతో నిండిపోయింది. చాలా మంది ప్రాంగణం బయట, హైవే రోడ్డుపై నిలిచి అక్కడ టిటిడి ఏర్పాటు చేసిన ఎల్ఇడి స్క్రీన్‌లలో కళ్యాణ ఉత్సవాన్ని తిలకించి తరించారు

ముత్యాల తలంబ్రాలకు ఎగబడ్డ జనం : స్వామివారి కల్యాణం అనంతరం టిటిడి యంత్రాంగం తలంబ్రాలు పంపిణీ చేసింది.. వీటికోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసింది. కౌంటర్ల వద్ద జనం ఎగబడ్డారు. ఒక దశలో జనం తలంబ్రాలు పొందేందుకు తోసుకున్నారు. పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

గజ వాహనంపై సీతారాములు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం రాత్రి శ్రీ సీతా రాముల కల్యాణం తరువాత గజవాహనంపై శ్రీ సీతారాములు భక్తులను కటాక్షించారు. సీతారాములు మాత్రమే కలిసి విహరించే ఈ గజ వాహనానికి ఎంతో విశిష్టత ఉంది. ఉదయం శివధను ర్బాలంకారంలో రాములవారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూప రింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

సీతారామ లక్ష్మణులకు స్వర్ణ కిరీటాలు బహూకరణ

ఒంటిమిట్టలో శ్రీ సీతారామ లక్ష్మణులకు రూ.6.60 కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన స్వర్ణ కిరీటాలు పెన్నా సిమెంట్స్ అధినేత పి.ప్రతాప్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు విరాళంగా అందించారు. నూతనంగా ఏడు కిలోల



మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు

ఒంటిమిట్టను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తాం


- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట దేవాలయాన్ని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సీతారామ కల్యాణ మహోత్సవం ముగిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరామ రాజ్యాన్ని మళ్లీ స్థాపించాలనే తపన తనదని, ప్రజలందరూ శ్రీరాముడు చూపించిన నీతి, ధర్మ మార్గాన్ని అనుసరించి జీవించాలని ఆకాంక్షించారు. శ్రీరాముడు ఒక వాగ్దానాన్ని ఎలా నిలబెట్టుకోవాలో తండ్రి ఆజ్ఞను ఎలా విధిగా పాటించాలో, కుటుంబ బంధాలను ఎలా పరిపూర్ణంగా పోషించాలో తెలియజేశారని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఒంటిమిట్టను ప్రధాన పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయడానికి ఈ ఆలయాన్ని దశాబ్ద కాలం క్రితమే టిటిడికి ఇవ్వడమైనదన్నారు. తిరుమల మాదిరిగా ఒంటిమిట్టలో కూడా అన్నప్రసాదం ప్రారంభించాలన్న నిశ్చయాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తీసుకోవాలని కోరుతున్నానని పేర్కొన్నారు. ఒంటిమిట్టను పుణ్యభూమిగా మార్చేందుకు ఇక్కడి కొండలపై ఆయుర్వేద మొక్కలను నాటనున్నట్టు తెలిపారు. ఒంటిమిట్టను దేవాలయ పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది 2047 నాటికి ప్రపంచంలో నంబర్ వన్ దేశంగా మారుతుందని చెప్పారు. తర్వాత టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఒంటిమిట్టలో అన్నప్రసాదం త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిటిడి ఇఒ జె.శ్యామల రావు, కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రజాప్రతినిధులు, బోర్డు సభ్యులు అధికారులు పాల్గొన్నారు.



స్వర్ణ కిరీటాలను ఛైర్మన్, ఇఒకు అందజేస్తున్న దాత పెన్నా సిమెంట్ ప్రతాప్‌రెడ్డి



భారీ జనసంద్రంతో నిండిన కల్యాణ వేదిక

సబ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- సిఎంకు సిఐటియు విజ్ఞప్తి

ప్రజాశక్తి - కడప అర్బన్

రిమ్స్ జిజిహెచ్‌లో పనిచేస్తున్న నలుగురు కార్మికులను అకారణంగా తొలగించి, ఇబ్బందులు గురి చేస్తున్న ఎ-1 పరిధిలో ఉన్న సబ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య సిఎం చంద్రబాబునాయుడు ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. రిమ్స్ జిజిహెచ్ ఏర్పడినప్పటి నుంచి శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. అప్పటినుంచి వివిధ రూపాల్లో ఎ-1 కాంట్రాక్టు పరిధిలో సబ్ కాంట్రాక్టర్‌గా బాలనారాయణరెడ్డి పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వ లేబర్ నామ్స్ పాటించకుండా, వేతనాలు అడిగితే తీసేయడం, తొలగించడం, బెదిరించడం భయాందోళన సృష్టించి, ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అక్కడ కొంతమంది సూపర్‌వైజర్లు మహిళా కార్మికులను వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. జీవో నెంబర్ 549 ప్రకారం రూ.16 వేల జీతం ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.10 వేలు, మరికొందరికి, రూ.12403 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. సక్రమంగా ఇపిఎఫ్, ఇఎస్ఐ అప్డేట్ ఉండడం లేదని పేర్కొన్నారు. మరికొందరికి పూర్తిగా కట్టడం లేదని తెలిపారు. సెక్యూరిటీ వారికి రూ.10 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులు అడిగితే ఏదో ఒక కారణం చెప్పి నోటీసు ఇవ్వకుండా, విధులకు రావద్దని మౌఖికంగా హుకుమ్ జారీ చేస్తున్నారని తెలిపారు. ఇందుకు నిదర్శనం ఇటీవల ఒక సూపర్‌వైజర్‌ను, 3 సెక్యూరిటీ కార్మికుల్ని తొలగించడమే అని పేర్కొన్నారు. సుబ్బారాయుడు అనే సూపర్‌వైజర్ మహిళ శానిటేషన్ కార్మికులను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. జిజిహెచ్‌లో పోక్సో కమిటీ కూడా లేదన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఎ1- సబ్ కాంట్రాక్టర్‌పైనా, సూపర్‌వైజర్‌పైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రైతు ఉద్యమాలకు సిద్ధమవుదాం

- ఘనంగా రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : రైతాంగ సమస్యలపై ఉద్యమాలకు సిద్ధమవుదామని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల కృష్ణయ్య, దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో కేక్ కట్ చేసి రైతులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనకు, ఫ్యూడల్ జమిందారి విధానానికి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటంలో భాగంగా అఖిల భారత రైతు సంఘం 1936 ఏప్రిల్ 11న లక్నోలో ఆవిర్భవించిందని పేర్కొన్నారు. నేటికీ 90 సంవత్సరాలు పూర్తి పూర్త యిందని తెలిపారు. నాడు-నేడు ఎప్పటికీ కూడా రైతాంగ ప్రయోజనాల కోసం రైతు సంఘం పోరాడిందన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తుందని వారు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం, జనసేన,బిజెపి కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ అడుగు జాడలలో నడుస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకు రైతులకు రూ. 20,000 పెట్టుబడి సాయం ఇస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని వారు అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గాలేరు-నగరి, తెలుగు గంగ లాంటి ప్రాజెక్టులను బడ్జెట్‌లో నిధులు కేటాయించి పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతన్న సమస్యలు పరిష్కారం కోసం రాన్నకాలంలో పోరాటాలకు సిద్ధం కావాలని వారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి,చిన్న సిద్దయ్య తోపాటు రైతు సంఘం నాయకులు హరి, వెంకటసుబ్బయ్య,సిద్దయ్య, రామయ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

చౌక దుకాణం సీజ్

ప్రజాశక్తి -గోపవరం : మండలంలోని శీలంవారిపల్లె గ్రామంలో ఉన్న చౌక దుకాణాన్ని ఎన్ ఫోర్స్ మెంట్ డిటి శివశంకర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సీజ్ చేశారు. శుక్రావరం వారు గ్రామంలోని చౌకదుకాణాలను సీజ్ చేశారు. ఇందులో భాగంగా గీతా ప్రసాద్ రెడ్డికి చెందిన చౌకదుకాణాన్ని తనిఖీ చేయగా 4897 కిలోల బియ్యం, 128 కిలో చక్కెర తక్కువ ఉండడంతో రేషన్ షాపును సీజ్ చేయడం జరిగింది. తనిఖీలో గోపవరం ఆర్ఐ ఆదిలక్ష్మి, విఆర్ఒ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వైవీయూకు స్వర్ణ పతకం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కాశ్మీర్ విశ్వవిద్యాలయంలో ఈనెల 4 నుంచి 7 వరకు నిర్వహించిన అఖిలభారత అంతర విశ్వవిద్యాలయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో వైవీయూకు స్వర్ణ పతకం లభించింది. విద్యార్థి డి.మురళీకృష్ణ 59వ కిలోల విభాగంలో బంగారు పతకం సాధించారు. మురళీకృష్ణ నారాయణమ్మ బి.పి.ఎడ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నారు. గత ఏడాది విశ్వవిద్యాలయానికి బంగారు పతకం సాధించడంతో వైవీయూ క్రీడా బోర్డు ద్వారా రూ. 30 వేల నగదు, ప్రతినెలా పదివేల రూపాయల పారితోషకం అందజేశారు. అతన్ని విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ప్రాంగణ ఎంపికల్లో వైవీయూ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైవీయూలో క్యాంపస్ డ్రైవ్‌లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వైవీయూ ఎంబిఎ శాఖ అధిపతి డాక్టర్ పి. సరిత ఆధ్వర్యంలో రిలయన్స్ రిటైల్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విస్తృత స్పందన లభించింది. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎటా రూ2.75 లక్షల వేతనం, పిఎఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి పలు సౌకర్యాలను సంస్థ కల్పిస్తుందని రిలయన్స్ లిమిటెడ్ మేనేజర్ భాను ప్రకాశ్ తెలిపారు.

అకాల వర్షం..వరికి నష్టం

దోస పంటకూ దెబ్బ - ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి రబీలో సాగు చేసిన వరి పంట దెబ్బతింది. ఒక్కసారిగా గాలులతో కూడిన వర్షం కురిసింది. రబీ సీజన్‌లో రైతులు 1600 ఎకరాలలో వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట చివరి దశలో ఉంది. 15 నుంచి 20 రోజులలో నూర్పిడి చేసే అవకాశం ఉంది. ఇంతలో గాలులతో కూడిన వర్షం రావడంతో పంట నేలకొరిగింది. రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చెంచుపల్లె, మడూరు, అన్నవరం, గుంత చియ్యపాడు తదితర గ్రామాల పరిధిలో వరి పంట నేలకొరిగింది. చేతికి వచ్చిన పంట నేలకొరవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటలను గుర్తించి నష్టపరిహారం అందివాలని కోరుతున్నారు. అలాగే సాగులో ఉన్న దోస పంట కూడా ప్రస్తుత అకాల వర్షంతో నష్టం వాటి ల్లుతుందని రైతులు పేర్కొంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల ఎకరాలలో మినుము, కొర్ర, నూగు, దోస వంటి పంటలు నూర్పిడి దశలో ఉన్నాయి. అర్ధరాత్రి అకాల వర్షం రావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. నూర్పిడి చేసిన పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. కొంత మంది ప్లాస్టిక్ పట్టలను కూడా కప్పుకోలేక పోయారు. దీంతో శుక్రవారం తడిసిన పంటలను ఆరబెట్టుకునే ప్రయత్నాలు చేశారు.



చెంచుపల్లి వద్ద నేలకొరిగిన వరి

ఐదెకరాల్లో వరి పంట దెబ్బతింది

రబీ సీజన్‌లో సాగుచేసిన వరి పంట వర్షానికి దెబ్బతింది. చేతికి అంది వచ్చిన 5 ఎకరాలలోని వరి పంట అకాల వర్షంతో నేలకొరిగింది. మూడు నెలలపాటు పంటను కాపాడుకుంటూ వచ్చాం. మరో 20 రోజుల్లో పంట నూర్పిడి చేసే దశలో వర్షం రావడంతో పూర్తిగా నెలకొరిగింది. ప్రస్తుతం వరి పంటను కట్టలు కట్టించుకునేందుకు అధిక ఆర్థిక భారం మీద పడనుంది. ప్రభుత్వం దెబ్బతిన్న వరి పంటను పరిశీలించేందుకు అధికారులను పంపి తగు న్యాయం చేయాలి.

- నరసింహారెడ్డి ,రైతు, చెంచుపల్లె

వర్షానికి తడిసిన నూర్పిడి చేసిన కొర్రలు

నూర్పిడి చేసి ఆరబెట్టిన కొర్రలు గురువారం అర్ధరాత్రి పడిన అకాల వర్షంతో పూర్తిగా తడిచాయి. వేసవికాలం కావడంతో వర్షం రాదన్న కారణంతో నూర్పిడి చేసిన కొర్రలను ఆర బెట్టాం. అర్ధరాత్రి ఒక్కసారిగా గాలులు వీచి అధిక వర్షం పడడంతో ప్లాస్టిక్ పట్టలను కూడా కప్పలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలను గుర్తించి నష్టపరిహారం అందించేలా కృషి చేయాలి

- రామ్మోహన్, రైతు, మైదుకూరు.



మైదుకూరు వద్ద తడిసిన కొర్రలను ఆరబెడుతున్న రైతు

ఎన్ఒసి లేకుండా విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ ఎడిఇ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - గోపవరం

ఎన్ఒసి (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) లేకుండా విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని పేదల కాలనీ వాసులు డిమాండ్ చేశారు. నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అవసరం లేకుండా పేదల కాలనీలకు విద్యుత్ మీటర్లను మంజూరు చేయాలని కోరుతూ సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎడిఇ కార్యాలయం ఎదటు పేదలు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఇ మేరి షర్మిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతాలైన సుందరయ్య కాలనీ, ఐలమ్మ కాలనీ, జ్యోతి బస్ కాలనీలు ఏర్పడక మునుపు ఆ ప్రాంతాలన్నీ నివాసానికి యోగ్యం కాకుండా ఉండేవని పేర్కొన్నారు. రాళ్లురప్పలు,కొండతిప్పలు,విష సర్పాలు సంచరిస్తున్న అడవిని తలపిస్తున్న ప్రాంతంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన పేదలందరూ గుడిసెలు వేసుకొని అక్కడే స్థిరనివాసాలు ఏర్పర చుకున్నారని పేర్కొన్నారు. ఎలాంటి సౌకర్యాలు లేకున్నా సుమారు 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం బద్వేలు పట్టణంలో విద్యుత్ మీటర్ల మంజూరు కోసం వారు దరఖాస్తు చేసుకుంటే ఇంటికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకొస్తే మంజూరు చేస్తామని సంబంధితాధికారులు పేర్కొంటున్నారని చెప్పారు. రెవెన్యూ అధికారులు కనీసం కాలనీల వాసులకు పట్టాలు కూడా ఇవ్వలేదని, అలాంటప్పుడు వారికి ఎలా సర్టిఫికెట్లు వస్తాయని ప్రశ్నించారు. అధికారులు వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మానవీయ కోణంలో ఆలోచించి స్థిరంగా నివాసాలు ఉన్న వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా విద్యుత్తు మీటర్లు మంజూరు చేయాలని ,లేనిపక్షంలో రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని, షేక్ మస్తాన్ షరీఫ్, చెప్పలి సుబ్బరాయుడు, షేక్ ఖైరున్‌బీ, పసుపుల మోక్షమ్మ, శాఖా కార్యదర్శులు పి.సి కొండయ్య, మూర ప్రసాద్, షేక్ మస్తాన్ బీ,షేక్ ఆదిల్ పార్టీ కార్యకర్తలు నాగార్జున,గంప సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, బాలస్వామి, చంద్రకళ, అరుణ, సిద్ధమ్మ, పీరయ్య, శ్రీనివాసులు, ఫాతిమా, వెంకటపతి, బాబయ్య,యువరాజు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి : ఆవాజ్



బద్వేల్ : నిరసన తెలియజేస్తున్న ముస్లిమ్ మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని శుక్రవారం పట్టణంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి.చాంద్ బాషా, బద్వేల్ పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్,అబ్దుల్ సత్తార్, అన్వర్‌బాష మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సరవణ చట్టం తీసుకొచ్చి మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం అని ప్రపంచానికి చాటిన మన దేశంలో ప్రజల మధ్య మతోన్మాద చిచ్చు పెట్టడం సరైంది కాదన్నారు. నరేంద్ర మోడీ ముస్లిములకు న్యాయం చేస్తానని మాయ మాటలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ చట్టం ముస్లిములకు నష్టమే తప్ప లాభం లేదని వాపోయారు. దేశంలో మిలటరీ భమూలు, రైల్వే రంగం, వక్ఫ్‌బోర్డు ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు. తక్షణమే వక్ఫ్ సరవణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు కరి ముల్లా, హసన్, ముస్తకిం, షరీఫ్, రసూల్, షంషేర్, ఇబ్రహీం, హబీబ్, మస్తాన్, మెహబూబ్‌బాషా ఆయూబ్, నాగూర్, ఖలీల్ పెద్ద ఎత్తున ముస్లిములు పాల్గొన్నారు

కడప అర్బన్ / కడప : నగరంలోని సెవెన్ రోడ్స్ సర్కిల్ వ్ద జెఎసి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదానికి వ్యతిరేకంగా ఎద్ద ఎత్తున ముస్లిం సోదరులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ముస్లిం ఓట్లను దండుకుని వారి శ్రేయస్సును, అభివృద్ధికి పాటుపడని అండగా నిలువని ప్రాంతీయ పార్టీలను నమ్మే పరిస్థితిలో ముస్లిం సోదరులు లేరని తెలిపారు. సవరణ బిల్లుకు కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపి ముస్లింల మనో భావాలను దెబ్బ తీయడమే కాకుండా వారి ఆత్మ అభిమానాన్ని తూట్లు పొడిచారని ఆరోపించారు. ఇకపై ముస్లింల శ్రేయస్సును యావత్ ముస్లిం సమాజ అభివృద్ధికి పాటుపడే పార్టీని ఎన్ను కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, సలావుద్దీన్, అలీఖాన్, బాబుబాయ్, నగరంలోని మత గురు వులు, వివిధ పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు, పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.


పెంచిన ధరను నిరసిస్తూ గ్యాస్ సిలిండర్‌కు వర్ధంతి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చేదిన్ అంటే ధరలు పెంచడమా.. మోడీ..!

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్‌పై సిలిండర్‌కు రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ శుక్రవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు వంట గ్యాస్ సిలిండర్‌కు వర్ధంతి జరిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి, పులివెందుల సమన్వయకర్త మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వానికి వంట గ్యాస్ ధర పెంచడం పరిపాటి అయిందని పేర్కొన్నారు. అచ్చే దిన్ అంటే ధరలు పెంచడమా, సబ్ కా వికాస్ అంటే ఇదేనా మోడీ అని వారు ప్రశ్నించారు. పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు కూడా ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉండడం గర్హనీయమన్నారు. కార్యక్రమంలో వేంపల్లె, వేముల, చక్రాయపేట మండలాల అధ్యక్షులు రామకృష్ణ, మూలంరెడ్డి రామాంజనేయులురెడ్డి, వెంకటేష్ బాబు, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, బద్రినాథ్, ఉత్తన్న, రాజు, అమర్, ఓబులేసు యాదవ్, లింగమయ్య, లక్ష్మిరెడ్డి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

బిజెపి, కూటమి ప్రభుత్వాలు ద్రోహం చేశాయి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేశాయని వైసిపి సోషల్ మీడియా మండల కన్వీనర్ రహంతుల్లా ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు అనేకసార్లు ముస్లిం ఆత్మీయ సమావేశాలు నిర్వహించి, ముస్లిం మైనారిటీలకు ఎలాంటి సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని గొప్ప హామీలు ఇచ్చారన్నారు. నల్ల చట్టాలను తెచ్చి ముస్లిం మైనారిటీ నాయకులకు వెన్నుపోటు పొడిచారన్నారు. చంద్రబాబును ముస్లిం మైనార్టీల సమాజం క్షమించదని చెప్పారు. మోడీ ప్రధాన మంత్రిగా ఉండి చేసిందేమీ లేదని విమర్శించారు. కులమతాల మీద చిచ్చు పెట్టడమే పని పెట్టుకున్నారని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగులు, కరువు, విద్య, వైద్యం ఇలా ఎన్ని సమస్యలు ఉన్నప్పటికీ అవి కనిపించడం లేదన్నారు. టిడిపిలో ఇంకా కొనసాగుతున్న ముస్లిం నాయకులు వెంటనే రాజీనామా చేసి బయటకు రావాలని పిలుపునిచ్చారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక బస్టాండ్ కూడలిలో బాటసారులకు వాసవి క్లబ్ ప్రతినిధులు శుక్రవారం మజ్జిగను పంపిణీ చేశారు. హరిహరపుత్ర అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా గురుస్వామి కారంశెట్టి సుబ్బారావు, క్లబ్ ప్రతినిధులు కెసి నరసింహా వెంకటసుబ్బయ్య, సుబ్బారావు, సంజీవ్‌కుమార్, వీరయ్య, లక్ష్మీకుమార్, తాత వెంకట సుబ్రహ్మణ్యం, రెడ్డయ్య, సురేష్‌కుమార్ మజ్జిగను పంపిణీ చేసిన వారిలో ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో పలుచోట్ల శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ ప్రియదర్శన్ రెడ్డి తెలిపారు. విద్యుత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మరమ్మతుల కారణంగా కడప రోడ్డు, వేంపల్లి రోడ్డు, ముద్దనూరు రోడ్డు, ఎస్టేట్, రాణివనం, వినాయక నగర్, పొద్దుటూరు రోడ్డు, సుందరయ్య నగర్ ప్రాంతాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఖాజీపేట : స్థానిక సబ్‌స్టేషన్ కేంద్రంలో విద్యుత్ మరమ్మత్ పనుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనట్లు విద్యుత్ శాఖ ఇంజనీర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

లింగాల : మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆశాఖాధికారి రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు 132/33 కెవి పులివెందుల సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ కారణంగా మురారి చింతల ఫీడర్ పరిధిలోని అంబకపల్లి, హిరోజీపురం, మురారి చింతల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడు తుందన్నారు.

పులివెందుల రూరల్ : శనివారం ఉదయం 6.గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 132 కెవి పులివెందుల సబ్‌స్టేషన్‌లో మరమ్మతులో భాగంగా పనులు చేస్తున్నందున నల్లపురెడ్డిపల్లి, ఇ కొత్తపల్లి, సరస్వతి మైన్స్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడూరు సమీపంలో ట్రాక్టర్ మోటర్ బైక్ ఢీకొని యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. శుక్రవారం పులివెందుల నుంచి వెంకటరాముడు(35) అనే వ్యక్తి మోటర్ బైక్‌పై అనంతపురం జిల్లా యాడికి మండలం ఓబులాపురం బయలుదేరారు. అంకాలమ్మ గూడూరు రాగానే ట్రాక్టరు ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే వెంకటరాముడు మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలున్నారు.


మృతి చెందిన వెంకటరాముడు

రేషన్ బియ్యం పంపిణీలో లుకలుకలు

డీలర్లు, ఎండియు ఆపరేటర్ల మధ్య వాగ్వాదం - ఇక్కడ పంచాకే ఇతర ప్రాంతాలకు వెళ్లాలని ఎండియు వాహనాన్ని అడ్డుకున్న స్థానికులు


ఎండియు వాహనాన్ని అడ్డుకున్న స్థానికులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రేషన్ బియ్యం మీరమ్ముకుంటున్నారని ఎండియు ఆపరేటర్లు, మీరే అమ్ముకుంటున్నారని డీలర్లు వాదించుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం ఎర్రగుంట్లలో చోటుచేసుకుంది. **వివరాలిలా ఉన్నాయి..** ఇక్కడ తమకు రేషన్ ఇచ్చాకే అవతలికి వెళ్లాలని స్థానికులు ఎండియు ఆపరేటర్లను అడ్డుకున్నారు. పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని సంబంధిత రేషన్ డీలర్లు ఇతరులకు అమ్ముకుంటున్నారని ఎండియు ఆపరేటర్ సులేమాన్ పేర్కొన్నాడు. రేషన్ బియ్యం 16మూటలను కిలో రూ.15 ప్రకారం డీలర్ రమేష్ తనకు అమ్మాడని సులేమాన్ తెలిపాడు. కొన్ని బియ్యాన్ని హోటళ్లకు తాను అమ్మనని పేర్కొన్నాడు. ఇలా ప్రతినెల జరుగుతుందన్నాడు. గోడౌన్ నుంచి వచ్చే బియ్యం మూట 50 కిలోలు అంటారని 45 కిలోలు మాత్రమే ఉంటుందని సులేమాన్ ఆరోపించాడు. **అసలేం జరిగిందంటే..** ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ వెనుకవైపు విధుల్లో రేషన్ పంపిణీకి ఎండియు వాహనం శుక్రవారం రాగా, వీధి మొదట్లో ఉన్న వారికి పంపిణీ చేయకుండా చివర్లో ఉన్నవారికి పంపిణీ చేసేందుకు సదరు వాహనదారుడు వెళ్లబోయాడు. ఈ క్రమంలో తమకు రేషన్ బియ్యం పంపిణీ చేశాకే అవతలికి వెళ్లాలని దాదాపు 50 మంది మహిళలు అడ్డుకున్నారు. రేషన్ బియ్యం తక్కువ వచ్చాయని. మీ 50 మందికీ రాలేదని ఆపరేటర్ సులేమాన్ చెప్పాడు. బియ్యం పంపిణీ చేసేవరకు వాహనాన్ని వెళ్లనివ్వబోమని మహిళలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రేషన్ డీలర్లు రమేష్ నాయుడు, వెంకటేశు, రమేష్, బాబాపీర్ అక్కడికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో డీలర్లు, ఎండియు ఆపరేటర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. మీరమ్ముకుంటున్నారంటే.. మీరే అమ్ముకుంటున్నారని పరస్పరం వాగ్వాదం చేసుకున్నారు. గుట్టుగా జరుగుతున్న రేషన్ బియ్యం వ్యాపారం ఒకరి నొకరు బయటపెట్టారు. వాహనాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేయగా స్థానికులంతా ఒక్కటై ఘర్షణ వాతావరణం నెలకొంది. రేషన్ డీలర్ బాబాపీరు, రమేష్ ప్రతినెల బియ్యం అమ్ముకుంటూ తమకు పంపిణీ చేయడం లేదని స్థానికులు ఆరోపించారు. ఎండియు వాహనం చాలా కాలంగా తమ ఇళ్ల వద్దకు రావడం లేదన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కేవలం మూడు రోజులు మాత్రమే డీలర్ రేషన్ షాపు వద్ద బియ్యం పంపిణీ చేస్తాడని, తర్వాత అన్ని అమ్ముకుని వెళ్లినవారికి లేవని వెనక్కి పంపుతాడని తెలిపారు. చివరకు వారికి రేషన్ బియ్యం పంపిణీ చేసి ఎండియు వాహనం తీసుకెళ్లారు. ఇటీవల ఎండియు వాహనాల వారు రేషన్ బియ్యం తమకు పంపిణీ చేయడం లేదంటూ ప్రకాష్ నగర్‌కు చెందిన మహిళలు నిరసన వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా వారిపై చర్యలు తీసుకోవడం లేదని సదరు మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా రేషన్ బియ్యం వ్యాపారం జోరుగా జరుగుతోంది. డీలర్లు, ఎండియు వాహనదారులు బియ్యం అమ్ముకుంటున్నారు. వినియోగదారుల ఇళ్లకు వెళ్లి దళారులు బియ్యం కొంటున్నారు. ఇలా రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. కందిపప్పు పంపిణీ లేదు. చక్కెర అరకొరగా పంపిణీ చేస్తున్నారు. మిగతా సరుకులు ఏవీ పంపిణీ చేయడం లేదు.

ఎండియు వాహనాలు తిరగడం లేదు..

ఎండియు వాహనాలు కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా తిరగడం లేదు. ప్రతి నెల వాహనానికి ప్రభుత్వం ఇచ్చే రూ.18 వేలు మాత్రం వారి ఖాతాలో జమ అవుతూనే ఉంది. మహాత్మా నగర్‌కు చెందిన మహిళలు నాలుగు నెలలుగా ఎండియు వాహనం రాలేదంటూ ఫిబ్రవరి నెలలో సంతకాలు పెట్టి కౌన్సిలర్ ద్వారా డిప్యూటీ తహశీల్దారు యామినికి ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదని వారు తెలిపారు.

ఏడాదిగా వాహనం రావడం లేదు : ఆయేషా (స్థానికురాలు)

రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు ఏడాదిగా వాహనం రావడం లేదు. రేషన్‌షాపు వద్దకు వెళ్లినా ప్రతినెల మొదటి మూడు రోజులు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. తర్వాత లేవంటున్నారు. మాకు ఇవ్వాల్సిన బియ్యాన్ని సదరు డీలర్లు అమ్ముకుంటున్నారు. ప్రతినెల రేషన్ పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

మూడు రోజులు తిరగాలి : ఫాతిమా (స్థానికురాలు)

ప్రతినెల పనులు వదులుకొని మూడు రోజులు రేషన్ బియ్యం కోసం తిరగాల్సి వస్తోంది. ఒక్కోనెల లేవంటారు. ప్రతి నెల ఎండియు వాహనం ద్వారా పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇప్పుడు వచ్చి మాకు బియ్యం వేయకుండా వెళ్లిపోతూంటే అడ్డుకున్నాం. సదరు వాహనదారుడు మీ కోటా రాలేదని అంటున్నాడు.

పంపిణీకి చర్యలు తీసుకుంటాం : ఆర్ఐ అర్జున్

రేషన్ పంపిణీ విషయమై ఆర్ఐ అర్జున్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. నిరసన తెలుపుతున్న వారికి వెంటనే బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతినెల కరెక్ట్‌గా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈనెల రేషన్ బియ్యం గోడౌనుకు తక్కువ వచ్చాయని తెలిపారు. రేషన్ బియ్యం సరఫరా చేయని ఎండియు వాహనాల వారిపై చర్యలు తీసుకుంటాం.


డీలర్లతో ఘర్షణపడుతున్న ప్రజలు

జ్యోతిరావు పూలే జీవితం స్ఫూర్తిదాయకం


పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బిసి సంక్షేమ సంఘ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రపంచానికే ఆదర్శమని ఎఎస్‌పి కె. ప్రకాష్ బాబు కొనియాడారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ పూలే సామాజిక తత్వవేత్తగా సమాజంలో అనేక విదాలుగా ప్రజలను చైతన్యం పరిచారని, ప్రజలలో అనాదికాలంగా పాతుకుపోయిన వివక్షలను నిర్మూలించుటకు తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, ఎఆర్ డిఎస్‌పి కె. శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, టైటాస్, వీరేష్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, ఆర్ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూలో.. సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన ఆధునిక సమాజ రూపకర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని యోగివేమన విశ్వవిద్యాలయ విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే 199 జయంతి ఉత్సవాలు యోగి వేమన విశ్వ విద్యాలయ పరిపాలన భవనంలో ఒబిసి సెల్ అధ్యక్షులు ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ఆచార్యులు ఎస్. రఘునాథ్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని పూలే చిత్ర పటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కడప : కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా అధ్యక్షులు చిన్న కుళ్లాయప్ప ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు కడప అసెంబ్లీ సమన్వయకర్త బండి జకరయ్య, కడప నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్, అబ్దుల్ సత్తార్, సయ్యద్ గౌస్ పీర్, పి.డి. సంజయ్ కాంత, రఫిఖ్ ఖాన్, మామిళ్ళ బాబు, మైనుద్దీన్, శ్యామలమ్మ, , గంగయ్య, ముబారక్ భాషా, కమల్ భాష, హరి ప్రసాద్, సిరాజుద్దీన్, సిద్దిక్ పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో...

మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధ నకు మనందరం కృషి చేయాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని మాజీ ఉప ముఖ్య మంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, నగరం సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం వైసిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షులు శివరామకృష్ణ యాదవ్, నగర అధ్యక్షులు గంగరాజు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత వైసిపి జిల్లా పార్టీ కార్యాల యంలో ఆయన చిత్రపటానికి, తర్వాత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో - ఆప్షన్ సభ్యులు, జిల్లా నగర అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పురుషుల కళాశాలలో.. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళా శాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జ్యోతిబా పూలే గొప్పతనాన్ని వివరించారు. సమాజంలో కుల వివక్షను రూపుమాపడానికి, మహిళా విద్యను ప్రోత్సహించడానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. జ్యోతిబా పూలే ఒక గొప్ప సంఘ సంస్కర్త. ఆయన జీవితం, ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ, సమాజంలో సమానత్వం, న్యాయం కోసం కృషి చేయాలి అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ అంకాల నాగరాజు, శివరామకృష్ణ, రమేష్ యాదవ్, అధ్యాపకులు అనిత, సంపత్ కుమార్ రాజు, గోవర్ధన్, సుభాని, విద్యార్థులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితం ధారపోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని టిడిపి తొగటవీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు మడక చక్రధర్ అన్నారు. ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. జోన్ 5 ఇన్‌ఛార్జి ఎల్ఐసి నరసింహులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పొన్నూరు రాంప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్, కడప నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్ పాల్గొన్నారు.

బద్వేలు : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా శుక్రవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సిద్ధవటం రోడ్డులోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక పట్టణ నాయకులు కె. నాగేంద్రబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, పట్టణ నాయకులు నాగార్జున,బాబయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్ష -కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్ రజక వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు చెప్పలి సుబ్బరాయుడు,వికలాంగుల హక్కుల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఖాజీపేట : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని టిడిపి నాయకులు కొనియాడారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయనకు పలువురు ఘన నివాళులు అర్పించారు. మండల టిడిపి సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరా ముల యాదవ్, మైదుకూరు నియోజకవర్గం బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్, లక్కు పుల్లారెడ్డి నివాళులర్పించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గున్నం పాటి వెంకటరమణ పాల్గొన్నారు.

వేంపల్లె : మహాత్మ జ్యోతి రావు పూలే గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక విప్లవ కారుడని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ సమన్వ యకర్త ధ్రువకుమార్‌రెడ్డి, వేంపల్లె, వేముల, పెండ్లిమర్రి, చక్రాయపేట మండల శాఖ అధ్య క్షులు రామకృష్ణ, వెంకటేష్, రామాంజనేయ రెడ్డి, మహ బూబ్ బాషా, డాక్టర్ సుబ్రమణ్యం, అమ ర్నాద్‌రెడ్డి, ఉత్తన్న, బద్రి, నాగరాజు, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ముద్దనూరు : స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షులు నడమల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మహత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణయ్య, చెన్నకేశవ రెడ్డి, బాలయ్య, సూర్యముని రెడ్డి, ప్రతాప్, కిరణ్ రెడ్డి, వెంకట్ ఆర్ట్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : మహత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి విద్యార్థి యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్, ఏపీ ఎమ్మార్పీఎస్ కడప ఇన్‌ఛార్జి గడ్డం నరసింహ, ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు మాట్లాడారు. బయన్న, దాసు, శ్రావణ్ పాల్గొన్నారు.

పిల్లల పోషణ పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - కొండాపురం

గర్భధారణ మొదలు బిడ్డకు రెండేళ్ల వయసు వరకు వెయ్యి రోజుల సమయం అత్యంత ముఖ్యమైందని, తల్లి బిడ్డకు తీసుకునే సంరక్షణ ఆ బిడ్డ ఆరోగ్యానికి, భవిష్యత్తుకు పునాది అని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.భారతి అన్నారు. కొట్టాలపల్లి, బేడుదురు, నేదరపేట అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార పక్షోత్స వాలను నిర్వహించారు. కార్యక్రమంలో మహిళ పోలీస్ జయలక్ష్మి, అంగన్వాడీ కార్యాకర్తలు సరోజ, మాధవి, వెంకటసుబ్బమ్మ, అంకాలమ్మ, సావిత్రి, జైనబి, గంగాదేవి, సచివాలయ ఎఎన్ ఎంలు, ఆశాలు, అంగన్వాడీ హెల్పర్స్ పాల్గొన్నారు.

దువ్వూరు : మండలంలోని గుడిపాడు సెక్టార్ సంగటి తిమ్మాయిపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమంలో చాపాడు ప్రాజెక్ట సిడిపిఒథ సావిత్రమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పిల్లల పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చేయాలన్నారు, గర్భం ధరించినప్పటి నుంచి పోషకాహారాలను తీసుకోవాలన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాపాలన్నారు. బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత అనుబంధ ఆహారాన్ని ఇవ్వాలని తెలిపారు. గుడిపాడు సెక్టార్ సూపర్వైజర్ జి.సౌజన్య, ఐటీసీ ప్రథమ్ కో-ఆర్డినేటర్ స్వరూప, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ సుహాసిని పాల్గొన్నారు.


కొండాపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ భారతి

వేంపల్లె : సుఖ ప్రసవం కావడం కోసం గర్భిణులు పౌష్టికాహారం తీసుకొని జాగ్రత్తలు పాటించాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం పేర్కొన్నారు. తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని రాజీవ్ కాలనీలోని 8వ గ్రామ సచివాలయంలోని అంగన్వాడీ కేంద్రం పరిధిలో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకట రత్నం, ఎంపిహెచ్ఇఒ ఫక్రుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, అంకయ్య, సిహెచ్ఒ బసయ్య , అంగన్వాడీ టీచర్ శైలజ, ఆశాలు పాల్గొన్నారు.

తొండూరు : మండలంలోని ఇనగలూరు-2వ అంగన్వాడీ కేంద్రంలో లింగ వివక్షత నిర్మూలన చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య మాట్లాడుతూ ఆడ, మగ లింగ వివక్షత సమాజ శ్రేయస్సుకు మంచిది కాదన్నారు. భ్రూణ హత్యలకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. భ్రూణ హత్యలు ప్రోత్సహించిన వారికి, చేయిం చుకున్న వారికి, చేసిన వారికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తా రన్నారు. సిహెచ్ఒ శిరీష, సచివాలయం ఆరోగ్య మిత్ర గౌరీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేముల : మండలంలోని చింతల జూటూరు గ్రామ పంచాయతీలో సిడిపిఒ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ సునీత మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ హసీనా, సర్పంచ్ రామాంజి, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసు, ఆశ వర్కర్ పాల్గొన్నారు.


స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో నిర్వహిస్తున్న గ్రామోత్సవం

చియ్యపాడులో ఘనంగా గ్రామోత్సవం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో శుక్రవారం సీతా రాముల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి నుంచి గ్రామంలో స్వామివారి ఉత్సవాలను వారం రోజులపాటు నిర్వహించారు. ప్రతిరోజు ప్రత్యేక పూజ కార్యక్రమాలు, కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పల్లకిలో అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రజలు నృత్యాలు, రంగులు చల్లుకుంటూ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాత్యాయని కన్స్ట్రక్షన్ ఎండి పి.వెంకట రమణారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మినారాయణ రెడ్డి, జయరామి రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో వ్యాసరచన పోటీలు


ప్రజాశక్తి - వేంపల్లె

బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ సెల్, జాతీయ సామాజిక సేవా వారి ఆధ్వర్యంలో అట్టడుగు వర్గాలను ఉద్ధరించడంలో విద్య పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించారు. 110 మంది విద్యార్థులు హాజరయ్యారు. అంబేద్కర్ జయంతి రోజున విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ట్రిపుల్‌ఐటి ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ చక్రవర్తి తెలిపారు. ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ ఆదేశాలు మేరకు వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జాతీయ సామాజిక సేవ కో-ఆర్డినేటర్ డాక్టర్ దీప్తి, డాక్టర్ కోనప్ప, అధ్యాపకులు మణికిరణ్, వేమయ్య, మేరీ మాధవి, డాక్టర్ సువర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ రాయితీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం 50శాతం వడ్డీ మాఫీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు శుక్రవారం పేర్కొన్నారు. బకాయి ఉన్న ఇళ్ల యజమానులందరూ ఈనెల 30లోపు పన్ను లు చెల్లించి సదరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2025-26 ఆస్తి పన్ను ఏక మొత్తంగా చెల్లించిన వారికి 5శాతం రిబేట్ పొం దవచ్చు అన్నారు. ఆ మేరకు వార్డు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధి కారులతో పన్ను వసూళ్లపై కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పన్నులు స కాంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ప్రజలను కోరారు.


మాట్లాడుతున్న కమిషనర్ రాముడు

ఎర్రగుంట్ల : 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదట, రెండవ అర్థ సంవత్సర ఆస్తి పన్నును ఒకేసారి చెల్లించినచో ఆ మొత్తంలో ఐదు శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందని నగర పంచాయతీ కమిషనర్ శేషఫణి ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను వెంటనే చెల్లించి ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనున్న ఆస్తి పన్ను బకాయిలు చెల్లింపులో 50 శాతం వడ్డీ రాయితీ ఇస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఏప్రిల్ 30 వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. అందరూ వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు.

మంత్రి ఆనంను కలిసిన గండి ఎసి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని గండిక్షేత్రంలో వీరాంజనేయ స్వామి దేవస్థానం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ వెంకటస్వామి శుక్రవారం బద్వేలులో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనను దుశ్శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ పునఃనిర్మాణం నిమిత్తం అదనంగా రూ.10 కోట్లు నిధు లు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.


దేవాదాయశాఖ మంత్రి ఆనంను కలిసిన అర్చకులు